**రెండవ బహుమతి పొందిన కథ**

# సుమిత్ర

## అవసరాల రామకృష్ణరావు

చందమామ ఉన్నచోట జగమంతా వెన్నెల.

మాతృమూర్తి ఉన్నచోట మనసంతా వెన్నెల.

అలాంటి వెన్నెల్లో ఓ చల్లని తల్లి ఒక చక్కని బాబును తొడమీద పడుకోబెట్టుకుని జోకొడుతూ కథ చెబుతూంది.

'...అప్పుడు పిల్లి ఏమందిటా, 'అదేమిటి కొంగమ్మపిన్నీ, నేనేమిటి, ని గుడ్లేమిటి తినడమేమిటి? ఇదెక్కడయినా ఉందా? ఉత్తిరోజుల్లోనే చచ్చే ఆచారం నాకు. అలాంటిది ఇవాళ భీష్మ ఏకాదశికదా...'

బాబు ఊ కొట్టడం మానేశాడు. సుమిత్ర కథ చెప్పడమూ మానేసింది.

'వెర్రి వెధవ! కథ చెప్పమని అడిగినంతసేపు పట్టలేదూ! ఎంత అమాయకంగా నిద్రపోతున్నాడో' అనుకుంది ఆమె. వెలిగిపోతున్న వెన్నెలలో వింతశోభలు వెదజల్లుతున్న ఆ అమాయకపు మూర్తివైపు అలాచూస్తూ ఉండిపోయింది. ఆ తల్లి హృదయంలో ఏం గిలిగింతలు కలిగాయో చెప్పలేము. పిల్లాడ్ని గుండెల కదుముకుని అదేపనిగా ముద్దుల వర్షం కురిపించింది.

బుల్లి పెదిమలు నలిగిపోయాయి. బూరి బుగ్గలు కందిపోయాయి. బాబు యిటూ అటూ కదిలేడు. వాడ్ని భుజంమీద వేసుకుని, డాబా దిగివచ్చి ఉయ్యాలలో వేసి ఊపేసరికి నిద్రపోయాడు.

మొహం మీద పడుతున్న జుత్తు వెనక్కి సద్దుకొని సుమిత్ర వంటింట్లోకి వెళ్ళి పాల గ్లాసునిండా పాలు నింపుకుని మావగారి గదిలోకొచ్చింది.

ముసిలాయన మంచం మీద పడుకొని తల క్రింద చేతులు పెట్టుకొని ఏదో ఆలోచిస్తున్నాడు. కోడలు పాలగ్లాసు బల్లమీద పెట్టింది. ఆయన యిటు తిరిగేడు.

'దీపం ఆర్పేశారేం మావగారూ, వెలిగించనా?'

'అక్కర్లేదమ్మా, వెన్నెలే బాగుంది. బాబు ఏడీ, యిలా తీసుకురా'

ఆ మనవడు, ఈ తాత ... ఆ యింటికి ఆద్యంతాలు...రెండు తరాల ప్రతినిధులు.. ఒకర్ని విడిచి ఒకరు అయిదు నిముషాలు ఉండలేరు.

బాబును తీసుకొచ్చి సుమిత్ర మావగారి పక్కలో పడుకోబెట్టింది.

'భాస్కరం రాలేదా?'

'లేదు. డిస్పెన్సరీనుంచి అలా సినిమాకి వెళ్ళేరుట. ఎన్నోసార్లు చెప్పేను, మిమ్మల్ని కూడా తనతో తీసుకెళ్ళమని. ఆయన నా మాట వినరు. నే నేం చేసేది చెప్పండి'.

ముసిలాయన ఈ మాటలు వినిపించుకున్నట్టే లేదు.

'ఇలా రా అమ్మాయీ' అన్నాడు.

సుమిత్ర రెండడుగులు ముందుకు వేసి తల వంచుకుని నిలబడింది.

'దగ్గరగా రా అమ్మా' సుమిత్ర దగ్గరకు వచ్చింది.

'కూర్చో' ముసిలాయన కోడలు తల ఆప్యాయంగా నిమురుతూ మొదలెట్టేడు

"చెప్తాను దయ్యపట్టడమే గాని మంచిని పొగడ్డం మనుషులకి అలవాటు లేదు తల్లీ! నిన్ను ఎదురుగుండా పొగుడుతున్నానని ఆశ్చర్యపడుతున్నావేమో!...నాకే ఇంతలా చేస్తున్నావుగదా, యింక మీ యింట్లో వాళ్ళకి ఎలా చేసేదానివో ఏమిటో నా ఊహకేమీ అందడం లేదమ్మాయ్."

"మీ అభిమానంకొద్దీ అలాఅంటారుగాని ఇందులో నే పెద్దచేస్తున్న దేముంది మావగారూ! అయినా ఎవరివాళ్ళకు వారు చేసుకోవడంలో వింతేముంది? నేను మీకేం వయిదాన్నా, పరాయిదాన్నా?"

"కాదమ్మా కాదు. నేను నీకు పరాయివాడిలా తోతాను, నీ ఒడిలో పసివాడిని"

సుమిత్ర మనస్సు పులకరించింది. అతను తన తనయుడు ఎంతో పెరిగిపోయినట్టూ తను చేరుకోవలసిన చోటు చేరువలోనే ఉన్నట్టూ అనిపించింది.

ముసిలాయన తనలో అనుకుంటున్నట్టూ అన్నాడు.

"లేకపోతే ఏమిటి? నాకు సీతాఫలాలు ఇష్టమనీ, యింటికి మంచివిరావనీ యీ కుర్రాణ్ని యెత్తుకొని పేరంటంకని పెట్టి నువ్వు పెద్దబజారుకు స్వయంగావెళ్ళి పళ్ళుఏరి కొని తెస్తే— ఈ వృద్ధుడికి తినిపిస్తే— అంతకన్న ఏంకావాలి? ఇలాంటి అభిమానం తల్లులకు పిల్లల మీద కాక మరెవరికుంటుంది?"

సుమిత్ర జవాబు చెప్పలేదు. ఏదో మరచిపోయినట్టు లేచి నిలబడింది.

"మీకు పాలు తెచ్చి యిద్దామని వచ్చాను. వచ్చి మాటల్లో పడి ఆ మాటే మరచిపోయాను...ఏదో మనసులో పెట్టుకొని మీరివాళ సరిగా భోజనమయినా చెయ్యలేదు. పాలు కాచి తెచ్చేను, తాగండి"

పాలగ్లాసు క్షణంలో చుక్క లేకుండా తాగేశాడు ముసలాయన.

"పాలలో ఒక్క మీగడతరక ఉన్నా నాకు డోకువస్తుంది. తక్కువ కాగితే తాగను. ఎక్కువ కాగి మీగడకడితే అసలే



"మరొక్కమారు స్తిమితంగా ఆలోచించు సుమిత్రా!"
"అన్నీ ఆలోచించే నేనీ నిశ్చయానికొచ్చాను."

తాగలేను. మూడు పాతికలు దగ్గర పడినా యిన్ని పదున్లు నాకు...మా అమ్మాయినా ఉందిగాని అది పాలు కాచి తెస్తే ఏదో ఒక లోటు ఉంటూనే ఉండేది. కాని, తల్లీ ఎంత శ్రద్ధ నామీద నీకు! నువ్వు తెచ్చిన పాలు నిత్యమూ అమృతమే."

సుమిత్ర గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది. ముసిలాయన నోరు కడుక్కున్నాడు. తువ్వాలు యిచ్చింది. తుడుచుకున్నాడు.

'ఎప్పుడూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను, మరుసు జన్మలో అయినా నువ్వు నా కూతురివై పుట్టాలనీ—నా గుండెలోని వాత్సల్యమంతా నీకే అందాలనీ...ముసిలాయన కంఠంలో కన్నీళ్ళు రాడం సుమిత్ర ఆశ్చర్యంగా చూసింది.

నిద్రపోతున్న బాబు తెప్పున లేచేడు. ఎంత జోకొట్టినా వాడు పడుకోలేదు.

'నీకు తాతయ్యగారికి కూడ జోలపాడాలి నాన్నోయ్' అంది సుమిత్ర.

'పాడమన్నా—పాడూ...నాకూ నిద్ర రాడం లేదూ...నేను మాత్రం వాడికన్నా తక్కువేం చేయించు కుంటున్నానని!'

"తిరిమూర్ఛని యివాళ నన్నిలా ఊబ్బించి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారేంమావగారూ! మీ కివాళ యింక నిద్దర రాదా ఏమిటి! పడుకోండి ఏదయినా పాడతాను.

సుమిత్ర అలా కొబ్బరాకుల మీద పొంచి ఉన్న చంద్రకిరణాలను చూస్తూ మావగారి పక్కలోపడుకొన్న కొడుకునుజోకొడుతూ ఎంతసేపు ఏం పాడిందో! ఇటు తిరిగిచూస్తే మంచంమీద భాస్కరం కూచునిఉన్నాడు.

పదినిమిషాల క్రితమే భాస్కరం సినిమా నుంచి వచ్చాడు. వస్తూనే మరాన్నుంచే సుమిత్ర పాట విని - అల్లంత దూరంలో ఆమెను చూస్తూ అలాగే ఉండిపోయాడు. ఆవాళ శనివారం. పైగా కార్తీక పున్నమి. సుమిత్ర శుచిగా తల స్నానం చేసి మడిగా మావగారికి వండి పెట్టింది. [illegible] తలవెంట్రుకలు విప్పి విరబోసుకొని ఉంది. పెద్ద బొట్టు పెట్టుకొని ఉంది. ఆస్థితిలో మూర్ఛని మావగారికీ, కన్న కొడుక్కీ ఒకే మాటు ఏదో పూర్వకాలం పాట పాడుతూ నిద్రబుచ్చుతున్న భార్యనిచూస్తే భాస్కరానికి అపూర్వమైన ప్రేమా, అనిర్వచనీయమైన భక్తి ఒకేమాటు కలిగేయి.

"ఎంత సేపయిందీ వచ్చి! నిల్చున్నారేం!"

"పిల్లలతల్లికి భర్తతో పనేం!" భాస్కరం నవ్వుతూ అన్నాడు. సుమిత్ర కూడా నవ్వింది. భర్త దగ్గరగా వెళ్ళబోయింది.

"అహహాఁ దూరంగా ఉండు. నేను సినిమాకు వెళ్ళొచ్చినవాణ్ణి. నీకట్టుకొన్నవాణ్ణి. నన్ను ముట్టుకుంటే నీమడి అంతా ఏంగాను!'

సుమిత్ర మంచం మీద అతని పక్కనే గబుక్కున కూర్చుంది. భాస్కరం కొంటెగా ఆమె ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు.

## సుమిత్ర

"ఆడవాళ్లు త్రిమూర్తుల్ని కంటే పిల్లల్ని చేసి ఉద్యోగాల్లో వేసి పోషించని చెబుతారు మొన్న మొన్నటిదాకా ఈ కథ వింటే నేను హేళనగా నవ్వేవాడిని. కాని యిందాక సినిమానుంచి వస్తూ నిన్ను చూసినపుడూ, యిప్పుడు నీ ఒడిలో పడుకొని ఆలోచిస్తున్నపుడూ ఆ మాట నిజమే అనిపిస్తోంది సుమిత్రా! మేం మొగాళ్ళం ఎన్నో పనులు చెయ్యొచ్చు ఎంత గొప్పవాళ్ళమే నా కావచ్చు కాని బుజ్జగింపులో, లాలింపులో, ఆదరణలో ఏ మాధుర్యం వెయ్యి జన్మలెత్తినా మాకు రాదు

సుమిత్ర మనస్సు తృప్తితో పొంగి పొర్లిపోయింది. భాస్కరం చెప్పుకుపోతున్నాడు

'నిజమే మీరన్నది నిర్భాగ్యురాలు కాని ప్రతి స్త్రీకి భర్త సాన్నిధ్యం సులభంగానే లభిస్తుంది కాని అత్తవారింటిని జ్యోతిర్మయం చేసే అదృష్టం ఏ సౌభాగ్యవతికో గాని దక్కదు అది నిలుపుకోడానికయినా పూర్వ పుణ్యం ఉండాలి నా మటుకు నేను యింతటి భాగ్యాన్ని ఒకసారి చేజేతులా వదులుకోలేను కాని కాని నా బాబు నా కళ్లు విప్పేరు ....' అంది సుమిత్ర.

* * *

ఇంతమటుకు ఏనాడో కొంతకాలం జరిగిన సంగతి

'నా మాట కూడా కాస్త వినండి నేనూ ఒక మనిషినే అన్న సంగతి గుర్తుంచుకోండి'

సుమిత్ర చకచకా నడుస్తూ గబగబా మాటాడేస్తోంది భాస్కరం ఆమెను అనుసరిస్తూ ఆమెకేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు

'మరొక్కమారు స్థిమితంగా ఆలోచించు సుమిత్రా'

'అన్నీ ఆలోచించే నేనీ నిశ్చయానికొచ్చాను'

'దీనికి తిరుగులేదా?'

'లేనట్టే లెక్క'

'అంతేనా?'

'ఎందుకన్ని సార్లు అడుగుతారు? నేనీ పల్లెటూళ్ళో ఒక్క నాటికి ఉండను మీకు నా మీద ఏ మాత్రం అభిమానమున్నా ఇక్కడ మాత్రం ప్రాక్టీసు పెట్టొద్దు' భాస్కరం చిత్రంగా ఆమె వైపు చూశాడు

"ఆలా కాదని యిక్కడే పెడితే?"

సుమిత్ర కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగి భాస్కరం పాదాలమీద పడ్డాయి

"నిజంగా యిక్కడే నన్ను కాదని ప్రాక్టీసు పెడతారా? సరే కానివ్వండి మీ సుమిత్ర పట్టుదల ఎటువంటిదో మీకు బాగా తెలుసు. జరిగేదేమిటో మీరూ ఊహించగలరు"

"అంటే?"

సుమిత్ర దుఃఖం ఆగలేదు కోపం, దుఃఖం కలిసి ఆమె మాటే పైకి రాలేదు

"అంటే ఏమిటో మీకు తెలీదా? మీకు నాకంటే మీ వాళ్లే ఎక్కువయినపుడు యిక నేనెందుకిక్కడ?" అనేసింది ఆ క్షణంలోనే ఆ సుశిక్షితురాలికి ఆమె మాట ఆమెకే తప్పుగా తోచింది అక్కడే కూలబడింది

"తొందరలో ఏదో అనేశాను అసలు నా ధోరణి అది కాదు అయినా మీ రింత వరకూ ఎందుకు తీసుకురావాలి? నే చెప్పినట్టు ఎందుకు వినకపోవాలి?"

భాస్కరం ఆమె గడ్డం పట్టుకుని బలవంతాన తనవైపు తిప్పుకున్నాడు





ఆంధ్ర ఏజంట్లు: మెసర్సు పి. ఆర్. ట్రేడ్ ఏజెన్సీస్, విజయవాడ.


**సంతోషితస్వాంతులు**

రాత్రిళ్లు నిద్రపోయి పగలు కలలు కనగలిగేవారు.

# ★ సుమిత్ర ★

"నేను వినలేకపోవడం కాదు. నేను చెప్పిన వన్నీ నువ్వు పూర్తిగా ఆలోచించకపోడమే యీ పరిస్థితికి కారణం. ఇంత చిన్న విష యానికి నువ్వు కాదంటావని నేను కలలో కూడా అనుకోలేదు. అత్తగారు ఉన్నా రనా, ఆడపడుచుకి మరోపని లేక యిక్కడే ఉండిపోయి నిన్ను రాసి రంపాన పెడుతుం దనా, దేనికి నువ్వింతగా వెనుదియ్యడం?"

"అలానే అన్నానా? అలాంటి మాట లెందుకూ?"

"లేకపోతే మరేమిటిది? కాగా పోగా యిక నీ కంట్లో రాయిలా ఆ ముసిలాయన మా నాన్న ఒక్కడున్నాడు. అంతేగా?"

"మీ సుమిత్రని మీరు అంతవరకే అర్థం చేసుకున్నారన్నమాట. మీకే కాదు నాకూ ఉన్నాడు తండ్రి. పెద్దవాళ్లను కనురెప్పలా చూసుకోవాలో కంట్లో రాయిలా చూసుకోవాలో నాకూ తెలుసు. ఇంత కొంపలో పాపం ఆయనొక్కర్నీ వదిలి ఎవరు రమ్మన్నారు? మనం ఎక్కడికి వెడితే అక్కడికి ఆయన్ని తీసుకెడదాం. ఆయన కేమైనా లోటువస్తే నన్నడగండి. అమ్మయ్య! ఇన్నాళ్ళనుంచీ అర్థంగాక వెర్రెత్తిపోతు న్నాను. ఇదిటండీ మీబాధ? భర్త ఒక్కడే తన వాడనీ భర్తతాలూకు వారెవరూ తన కేమీ కారనీ అనుకునేంత అజ్ఞానురాల్ని కాను."

సుమిత్ర మనస్సు అంతటితో ఎంతో తేలికయి పోయింది. చెంపలమీద కన్నీటి చారికల్ని తుడుచుకొంది. భర్తవైపు తలెత్తిచూసింది. ఆమెకు కావలసిన సమాధానం ఆ ముఖంలో కనపడలేదు.

"అదేం యింకా అలాగే ఉన్నారు?"

"పోనీ అలా జరిగినా బాగున్ను. ఆయన అలా చెయ్యడుగద! మొన్న నే నలిగి చస్తున్నాను. నేనీ సంగతి నాన్నని అడక్కపోలేదు. అడుగుతే ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నారు?"

"ఆయన అదోవిధంగా నవ్వి" ముసలాడి మాటలని చాదస్తం కింద కట్టేస్తావేమో బాబూ! తాతలనాటినుంచీ ఉన్న యిల్లు యిది. మన యింట్లో ఉన్న ముసిలిగేదిని రెండు నెలలదూడగా మా చినతాత కొన్నాట్ట. ఇప్పుడు దాని పిల్ల మనకు పాలిస్తోంది. డాబా పక్కనిదాని ఎత్తున ఎదిగిన సంపెంగ చెట్టు మీ అమ్మ ఈ యింటికి కాపురానికి వచ్చిన కొత్తలో నాటినది. ఇలాంటి బంధాలన్నీ తెంపుకొని నే ఎక్కడికో ఎలా రాను? ఇక్కడే యీ మట్టిలోనే పుట్టేను. ఇందులోనే కలిసిపోడం నాకోరిక"... అన్నాడు, బాగుందా?" సుమిత్ర ముఖ పద్మం మరింత ముకుళించుకుపోయింది.

"అలా అయితే నే నేం చేసేది?" అనేసి ఊరుకుంది. అయిదు నిమిషాలు అతి భారంగా గడిచేయి.

"మీరే ఆలోచించండి. నేనుపట్నంలో చదువుకున్నదాన్ని మీరు కోరి కోరి కనీసం యింటరు ప్యాసయిన నాలాంటి దాన్ని చేసుకున్నపుడు నాలాంటి ఆడదాని హృదయంలో ఎలాంటి ఆశలు ఉంటాయో కొంచెం ఊహించండి. క్లబ్బులనీ, మీటింగులనీ, సినిమాలనీ, పికార్లనీ...ఎన్ని ఆశా సౌధాలు కట్టేనో - మీ రీపెద్దాపురం పొలిమేర దాటనంటే నే నేమనుకోవాలి?"

భాస్కరం ఆమె మాటలు విన్నాడో లేదో తెలీదు, మరోధోరణిలో మొదలెట్టేడు.

"ఆడవాళ్లకి అవకాశాలు ఎప్పుడోగాని రావు. వచ్చిన అవకాశం జారవిడుచు కుంటే జీవితమంతా దుఃఖించినా విముక్తి ఉండదు. ఈ యింటి కంతటికీ నువ్వు లక్ష్మివి - రాణివి"

"ఎవరింటికి? నాయింటికి నేను లక్ష్మిని-నా రాజ్యానికి నేను రాణిని"

"ఈ యిల్లు నీదికాదా?"

సుమిత్ర జవాబు చెప్పలేదు. ఇంతలో సుందరమ్మ అక్కడికొచ్చింది.

"ఇక్కడట్రా ఉన్నారూ? ఈ డాబా మీద ఏం చేస్తున్నారూ? నాన్న నిన్ను పిలుస్తున్నాడు రా తమ్ముడూ" భాస్కరం

## సప్తవిధ కారణాలు

ఆయన ఏదైనా కొన్నాడూ అంటే దానికి ఏదో ఓ కారణం ఉంటుంది.

ఆవిడగారు కొంటే ఈ క్రింది సప్తవిధకారణాలలోఏదో ఒకటి అయితీరుతుంది. (1) ఆయన గారు ఇది మన కొందుకే అన్నారు. (2) అది లాకాయి లూకాయి కాదు, చెన్నాపట్టం నించి వచ్చింది. (3)పొరుగింటి వాళ్లు తన్నుకు చచ్చినా దీన్ని కొనే తాహతు రాదు (4) ఊళ్లో ఇంకెవ్వరింటా లేదు. (5) ఊళ్లో అందరూ కొనేసుకున్నారు. (6) దీని తరహాయే వేరు. (7) ఎందుకంటే......


బుక్కని లేచి మొహం తుడుచుకుని కిందకి గబగబా దిగివెళ్ళిపోయాడు. డాబామీద సుమిత్ర, సుందరమ్మ మిగిలేరు.

"ఆడది మొగాణ్ని ఆనందడోలికల ఊగించనూగలదు, విషాద వీచికల తూగించనూ గలదు అంటారు, ఇదే కాబోలు" అనిపించింది సుందరమ్మకి సుమిత్ర మొహం చూడగానే. కాని ఆమాట అప్రయత్నంగా పైకి అనేసి నాలిక కరుచుకుంది. అసలే బాధపడుతున్న సుమిత్రకు యీమాట కారం రాసినట్లయింది. సుందరమ్మ మాటలు మొదట చురుక్కుమన్నా, సుమిత్ర తర్వాత లేని నవ్వు తెచ్చుకొని అంది:

"నువ్వు నాకంటె పెద్దదానివి కదా

అవకాశవాదికి నిర్వచనం: మానం చేద్దాం, చేద్దాం అనుకుంటున్న పనులు మానకం టె ముందు ఝామ్మని చేసేసే వాడు.





గణ గణ గంటల గంగిరెద్దులకు
జనగణమనముల నివాళులు !

—చిత్రకారుడు : శీలం యతిరాజు.

వదినా, నువ్వు మా అన్నగార్ని జేబులో పెట్టి తిరుగుతున్నావో కాస్త చెబుదూ, విని నేర్చుకుంటానూ!'' ఈమాటకి సుందరమ్మ ముఖం మలినమైపోయింది. ఆమెకి ఈ మాట అవమానకరంగా తోచింది.

"ఎవరి గొడవ వాళ్ళది, నాకెందుకు? బుద్ధిలేక ఏదో ఒకటి అంటూవుంటాను." అనేసి మెట్లకైపు నడుస్తూ పైకి వినపడే లాగ...

"మా అమ్మ ఎప్పుడు చచ్చిందో అప్పుడే మా యిల్లు ఎడారి అయిపోయింది. ఇంక ఆ ముసలాయన ఒక్కడూ నీళ్ళకు కంట కంగా కనిపిస్తున్నాడు. అయినా మా అమ్మ స్థానాన్ని పూర్తి చెయ్యడానికి అందరికీ అర్హత ఉండి ఏడవొద్దూ మా తమ్ముడు వెర్రిగాని!" అని అసందర్భంగా ఏవో కొన్ని మాటలాడేసి గబగబా మేడమెట్లు దిగి వెళ్ళిపోయింది. సుమిత్ర తెల్లబోయి నిలబడిపోయింది.

వదిన యింత ఘాటుగా మాట్లాడ్డానికి తగిన తప్పు తను చేసిందా? నిజంగా తను అనుకున్నది ఆశించింది దోషమేనా?

ఎం.బి.బియస్సు ఫైనలియరు చదువుతున్న పురుషుడు తన భర్త అనపుడు తను ఎంతో గర్వించింది! ఎన్ని ఆశాసౌధాలు నిర్మించు కొంది! విలాసానికిగాని విజ్ఞానానికిగాని పట్నవాసంలోనే గాని యీ పల్లెటూళ్ళో- ఎలక్ట్రిక్ దీపాలూ కొళాయిలూ అయినా లేని యీ కొంపలో స్థానముందా? ఆడది బజారుకి కూరలకి వస్తే ఆబ్బురంగా విమానాన్ని చూసినట్టు చూసే యీ పల్లెటూళ్ళ గబ్బిలాయిల మధ్యనేనా తను యావజ్జీవం గడపడం!

# ★ సుమిత్ర ★

ఎన్ని కోణాలనుంచి ఆలోచించి చూసినా సుమిత్రకు తను చేసినదాంట్లో రవంత దోషమయినా గోచరించలేదు.

బాబు వదిన పిల్లలతో ఆడుకోడానికి అలా వెళ్ళేడు. సుమిత్ర కేమీ తోచక డాబా చివరకి వచ్చి పెరట్లోకి చూసింది.

"దాని కిష్టంలేనప్పుడు నువ్వెంత తాపత్రయపడి ఏం లాభం తమ్ముడూ? మీదారి మీరు చూసుకోండి. ఇంతలోకే వాళ్ళే మీ అయిపోడులే" ఈ మాటలు సుందరమ్మవి. సులకమంచం మీద మావగారు విచారంగా కూర్చుని ఉన్నాడు. సమీపంలో భాస్కరం పచార్లు చేస్తున్నాడు. సుందరమ్మ కళ్లొత్తుకుంది.

'అమ్మ రెండేళ్లయి పోయింది. నువ్వప్పుడు నాలుగో ఏడు చదువుతున్నావు. ఈ రెండేళ్లూ నాన్నొక్కడే గడిపేడా, ఏ కోడలయినా వచ్చి ఉద్ధరించిందా? నేను ఆడదాన్ని, ఎంత అభిమానపడి ఏం లాభం? పరాయి యింటికి అమ్ముడుపోయిన దాన్ని—నేను ఉన్నా ఒకటే ఊడినా ఒకటే...'

ఈసారి ముసిలాయన కోప్పడ్డాడు.

'ఏమిటి తల్లీ, యీ అర్థంలేని ధోరణి? నువ్వు లోపలికిపో, మేం మాటాడుకోవాలి'

'అవునా నాన్నా అవును. నిజం చెబితే అర్థంలేని ధోరణే. పాపం, అనుభవించేది నువ్వు—పదవే పాపాయీ' అని ఒడిలో ఉన్న ఆరేళ్ల పిల్లని ముందుకుతోసి గదిలోకి పోయి తలుపు వేసుకుంది.

'బాబూ, మందుల పార్సెళ్లు మళ్ళీ యిక్కడికే పంపకు, మీ రెక్కడికెడదామనుకుంటున్నారో అక్కడికి తిప్పెయ్యి. రైలు ఛార్జీలు దండుగ'

భాస్కరం తండ్రి మాటలు విన్నాడో లేదో... కాలి బొటకన వ్రేలితో నేలను రాస్తూ మెల్లిగా అన్నాడు.

'అది కాదునాన్నా...' ఆ తర్వాత ఏం మాట్లాడాలో అతనికి తోచలేదు. సిగ్గుపడి తండ్రి పక్కనే కూర్చుండి పోయాడు. ముసలాయన తేలికగా నవ్వేడు. 'నా కోసం విచారిస్తావెందుకు వెర్రిబాబూ! రాలిపోయే పండుటాకు యిది. చిగిరించబోయే కొత్త కొమ్మలు మీవి. దానికోసం యిది ఎక్కడేనా త్యాగం చేస్తారా? మీరు కులాసాగా కాపరం చేస్తూంటే తప్పకుండా మీ దగ్గిరకి వచ్చి నాలుగు రోజులపాటు ఉంటాను'

'అది కాదునాన్నా......'

'మనం దేవాలయానికి వెడుతూ ఉంటాం. దార్లో వందలకొద్దీ బీదవాళ్లు కనిపిస్తారు. కాని మనం వాళ్ళని చూడకుండా తొందరగా దైవ దర్శనానికని తహతహలాడతాం. అందులో అసహజమేముంది?'

ఈ మాటలు డాబామీంచి వింటున్న సుమిత్ర గుండెల్లో గాలంలా గుచ్చుకున్నాయి. అది సహజమేనా? అందులో అసహజ మేమీ లేదా?

'అది కాదు నాన్నా...అన్నాడు మళ్లీ భాస్కరం. ఈసారి ముసిలాయన పకపక నవ్వేశాడు.

'ఏదికాదు? లేకే—యింక కబుర్లు చెప్పకు. అసలు నువ్వూ నీ పెళ్ళామూ బలవంతాన యిక్కడ బైతాయించినా, నే ఒప్పుకోను తెలిసిందా?"

ముసిలాయన మంచితనానికి సిగ్గుపడి భాస్కరం అక్కడ ఉండలేకపోయాడు. తిన్నగా డాబామీదకు వచ్చేశాడు.

సుమిత్రమీద చెప్పలేని కోపంతో అతడు డాబామీదకు వచ్చాడు. కాని సుమిత్ర కూర్చున్న తీరూ, సానుభూతి కోరుతున్న ఆమె మొహామూ, కన్నీళ్ళతో నిండి దైన్యభావం వెడల గ్రక్కుతున్న ఆమె కళ్ళూ - వీటన్నింటి వెనకా తన్ని బలంగా ఆకర్షించి మత్తెక్కిస్తున్న అమోఘమైన ఆమె సౌందర్యం, చూసి భాస్కరం తగ్గాడు.

"చూడూ, కంట తడిపెట్టిన ఆడదాన్ని కాదని ఏ పురుషుడూ ముందుకు రాలేడు. నీ మీద నాకు పూర్తిగా నమ్మకముంది. నీ సంస్కారం మీద నాకు విశ్వాసం ఉంది. ఆలోచించుకుని చెప్పు. నువ్వు ఎలా అంటే అలాగే, నే నేమీ అనుకోను"

సుమిత్ర అయిదు నిమిషాలు ఆలోచించింది.

"సామాన్లు సర్దేశాను. నాన్నేరు వెళిపోదాం" అంది. అంటూనే భాస్కరం మొహంలోకి చూసింది. అతని మొహంలోని వెలుగు ఒక నిమిషంపాటు మాయ

---

మార్క్‌ట్వేన్‌కు అపరిచితులు చాలమంది తమ ఫొటోలు పంపేవారు, తమకూ ఆయనకూ చాలా దగ్గిర పోలికలు ఉన్నాయంటూ. వారికి సమాధానాలు వ్రాయడం మార్క్‌ట్వేన్‌కు పెద్ద ఇబ్బంది అయిపోయింది. చివరికి కొన్ని వందల కాగితాలు ఈవిధంగా అచ్చుకొట్టించి ఫొటోలు పంపినవారికి పంపించేవాడు:

"అయ్యా, మీ ఉత్తరం, మీ ఫొటో అందాయి. మరెవ్వరికీ లేనన్ని నా పోలికలు మీలో ఉన్నాయని నా దృఢ నిశ్చయం. అసలు నా పోలికలు నాలోకంటే మీలోనే ఎక్కువగా ఉన్నాయి. ఇంతెందుకు, ఇకనుంచీ మీ ఫొటో లో చూసుకుంటూ గడ్డం గీసుకోవాలనుకుంటున్నా నంటే నమ్మండి. ఇట్లు, విధేయుడు, ఎస్. క్లిమెన్స్."

---


## రు. 5 లకు పార్కర్ కలము

ప్రపంచ ప్రసిద్ధిపొందిన పార్కర్ ఫౌంటెన్ కలము రు. 5/-లకు ఎక్కడైనా పొందగలరా? లేదు. ఎక్కడా లభ్యంకాదు. అయితే, మా విశేష తయారీ ఫౌంటెన్ కలముల అమ్మకమును జోరుగా సాగటానికిగాను, 1,000 పార్కర్ జూనియర్ పరిశోత్తరకం ఫౌంటెన్ కలములను ఒక్కొక్కటి రు. 5/-ల ధరకు, యివ్వతలచి యున్నాము. మీరు యీ అవకాశాన్ని వదులుకోకుండా వినియోగింపతలచుకొంటే, నేడే ఆర్డరు చేయండి.

ప్యాకింగు, పోస్టేజి రు. 1/4 అదనంగా అవుతుంది.

వరా :—ఏ స్కీము క్రింద ఈ ఏర్పాటు జరగటం లేదు.

ఆర్డరు చేరిన వెంటనే కలము సప్లయి చేయబడును.

JOLLISONS - Post Box No. 1044, Delhi (P)

మయింది. అతను లేని చిరునవ్వు తెచ్చుకుని బలహీనంగా "అలాగే" అన్నాడు.

* * *

సుమిత్ర నెలరోజులై వదిలి వచ్చిన తండ్రికి ఉత్తరం రాస్తోంది తా మిలా లని వారం విశాఖపట్నం ప్రయాణం పెట్టుకున్నట్టూ, ఆనాడు జనతాకి అనకాపల్లి స్టేషనుకువచ్చి తన్ని కలుసుకోమన్నట్టూ... ఇంతట్లో కేకలు వినిపించాయి. సుమిత్ర ఆ ఉత్తరాన్ని అలా వదిలి గుమ్మంలోకి వచ్చే సరికి కనపడిన దృశ్యమిది.

బాబు తాతమీద గుఱ్ఱమెక్కి ఊగుతున్నాడు పాపాయీ, ఆనందూ పక్కని నిలబడి గెంతుతున్నాడు. సుందరమ్మ తండ్రిని కేకలేస్తోంది:

"అదేమిటి నాన్నా, నీకేమయినా మతుందా పోయిందా? మొన్న మొన్న జబ్బు పడిలేచావ్, ఆ గుంట వెధవని అలా గంటల తరబడి ఎంత కని గుఱ్ఱమెక్కి ఆడిస్తావ్" వాళ్లెవరూ వీళ్ల మాట విన్నట్టులేదు. అటు వేపు తిరిగి ఏదో వాళ్లల్లోవాళ్లుమాటాడుకుంటున్నారు. సుమిత్ర కదేదో నాండా లనిపించింది. చుట్టూతిరిగి రెండోవైపు చివరిగది కిటికీలోంచి చూసింది.

"తాతా, తాతా, మరి.. ఈ గుఱ్ఱానికి తోకేదీ?" అన్నాడు బాబు

"కాకెత్తుకు పోయిందిరా!" అన్నాడు తాత

బాబు పక్కున నవ్వేడు.

పాపాయి, ఆనందు కూడా నవ్వేరు. అందులో అంత విరగబడి నవ్వడాని కేముందో తెలీదు. ఆ ముసిలాయన కూడా పక పక నవ్వేడు. పిల్లలతో పిల్లాడిలా కలిసిపోయి—ఆరునెల్ల అందాలపాప 'ఛీ, ఛీ' అంటే చిరునవ్వు నవ్వినట్టు— ఇన్నేళ్ల యీ ముసిలాయన నిర్మలంగా నిండుగా ఎలా నవ్వగలుగుతున్నాడో సుమిత్రకి అర్థం కాలేదు.

సుందరమ్మ గబగబావచ్చి బాబును బలవంతాన చంక వేసుకుంది. బాబు ఇల్లెగిర పోయేట్టు ఏడుపు మొదలెట్టేడు. వాడ్ని లోపలికి తీసుకెళ్లి ఇన్ని బిస్కట్లు ముందు పోసి 'మింగరా మింగు.. అంతేగాని తాత మీదెక్కి గెంతుతావేమిటే? తప్పుకాదూ? తాతకి 'అయి' వస్తుందమ్మా' అంది. బాబు ఠకీమని ఊరుకున్నాడు. బిస్కట్లకోసం పాపా, ఆనందూ 'అమ్మా, నాకో' అంటూ చేతులుజాపేరు. సుందరమ్మ రెండు వాళ్లకీ పడేసింది.

"పోనిద్దూ సుందరం— వాడు రెండ్రోజుల్లో వెళ్ళిపోతాడుగా" అన్నాడు ముసలాయన.

సుందరమ్మ తండ్రికి ఒంట్లో బాగులేదని పదిహేను రోజులయివచ్చింది. ఈమధ్య వారంరోజులై ఆయనకి బాగా ఖులాసాగా ఉంటోంది. ఆవిడ అవాళే ప్రయాణం పెట్టుకుంది.

"వాడెప్పుడు వెడతాడో నాకు తెలీదు గాని... నే నివాళ సాయంకాలం బండికి వెళిపోతున్నాను నీకు తెలుసుగదా, వెళ్ళే లోగా మాత్రం మళ్లీ యిలాంటి అఘాయిత్యం పనులు చెయ్యకు. నే ఉండగా మాత్రం యిలాంటి పనులు చెయ్యనివ్వను. గంటయి చూస్తున్నాను అదే ఆట, అదే ఆటా? ఎముకలు పిండైపోవూ? నీకు మళ్లీ వస్తే ఎవరు చేస్తాడూ?" సుందరమ్మ దృష్టి హఠాత్తుగా మీసంలేని తండ్రి మూతిమీద పడింది. ఫక్కున నవ్వింది.

"లోకంలో యిందరు తాతా మనవల్ని చూశాంగాని ... ఎక్కడలేని చిత్రాలూ యీ కొంపలోకే వచ్చిపడ్డాయి. అయ్యో రాత! అయ్యో నాన్న! నువ్వు నీ మీసం... నీ మనవడూ.. ఓహోహో!" సుందరమ్మ విరగబడి నవ్వింది. ముసిలాయన కెందుకనో మరి సిగ్గనిపించింది. మనవణ్ని తీసుకు లోపలికి వెళ్లిపోయాడు. సుమిత్ర యివతలకి వచ్చింది. తను మావగార్ని మొహమెత్తి ఎప్పుడూ అంతలా చూడలేదు. ఆయనకి పెద్దపెద్ద వంకీలుతిరిగిన మీసాలుండేవని అందరూ చెప్పుకొనేవారు. ఈమధ్య తను వచ్చాకకూడా ఒకసారి మీసాలుచూసినట్టు జ్ఞాపకం. అంతలో హఠాత్తుగా ఓనాడు ఆయన మీసాలు పూర్తిగా మాయమయ్యాయి! మొదట ఆశ్చర్యపడినా తరువాత ఎవరినో చూసి తనలా అనుకుందేమో, ఈయన కసలు మీసాలులేవేమో అని సరిపెట్టుకుంది. అయినా అనుమానం బాధిస్తూనే ఉంది! సుందరమ్మ 'అయ్యో నాన్న! నువ్వూ, నీ మీసం, నీ మనవడూ!' అంటూంటే మాత్రం ఆత్రుత చంపుకోలేకపోయింది.

"ఏమిటది వదినా, ఎందుకంత నవ్వూ, నాకూ కొంచెం చెప్పకూడదా?" అంది.

(67-వ పేజీ చూడండి)

FPY 29-TEL



ఆదగ్గును అణచండి
ఆ గొంతు
పుండును
ఉపశమింప
జేసి
మాన్పండి

పెప్స టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, విశారక సారములు కలవి. మీరు పెప్సను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స అంత శక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స దగ్గును అణచివేస్తాయి, గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, మీ శ్వాసకోశాలను రక్షిస్తాయి. కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్ఫ్లుయెంజా. బ్రాంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

పెప్స సేవించండి.

PEPS



'జగద్విఖ్యాతిగాంచిన
గొంతు-రొమ్ము టేబ్లెట్లు.
మందు అమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.

మద్రాసు సోల్ ఏజంట్లు: దాదా & కంపెని, పార్కుటౌన్, మద్రాసు-8.

## ★ సుమిత్ర ★

(21 వ పేజీ తరువాయి)

"మా నాన్న ఈమధ్య వివాహం తీసేయిం చాడు తెలుసా?" అంది సుందరమ్మ నవ్వుతూ.

సుమిత్ర అర్థం కానట్టు అదోలా తలూ పింది.

"ఎందుకో తెలుసా?"

"ఎందుకేమిటి?"

"తెమనని!"

సుమిత్రకేమీ అర్థం అవలేదు. తనెప్పుడూ వీళ్ళ తాతగారికి ఫ్యాషనా?

"తాతగారికి ఫ్యాషనుకాదు. మనవడి గారి ఫ్యాషనుకి తక్కువొచ్చిందని. మరి తాతకీ మనవడికీ ఫ్రెండ్షిప్ కదుటమ్మా?"

సుమిత్రకింకా అర్థమవలేదు.

"ఇంకా బోధపడలేదుటమ్మా పెర్రిపిల్లా, తాతగారు మనవణ్ణి ముద్దెట్టుకోబోయా రుట. మీసాలతాకిడికి మనవడు ఒప్పుకోలే దుట. ఇంకేముంది మహారాజానయినా ముట్టు కోనియ్యని ఆ మీసాలకి మంగలాడిపని తగి లింది...నాకే చిత్రంవేస్తుంది సుమిత్రా! ఏళ్ళైవీళ్ళ వయస్సున్నదీ మీసం. వయస్సు వాడు రోజుకు అరగంట దువ్వే దీ మీసం. కానియ్యి అఖరికి మా తెల్లి మనవడి పాల బడింది.

ఏ వస్తువు ఎక్కాలున్నంటుందో చెప్ప లేముగదా!"

సుందరమ్మ మళ్ళీ నవ్వుకి అంకించుకుంది. ఈసారి సుమిత్రకూడా నవ్వడానికి ప్రయ త్నం చేసింది. కాని ఆమె హృదయంనిండా ఏదో మధురమయిన ఆవేదన నిండిపోయి నవ్వలేకపోయింది.

ఎవరివాళ్ళు వాళ్ళకి అలాగే ఉంటారు కాబోలు! మళ్ళీ యీ గుంటవెధవ లేడూ, ఎవడు, వాకొడుకు అనందు, వాడు 'కీ' అంటే చాలు మా నాన్న చెవులు మూసు కు నేవాడు. ఇప్పుడు బాబుగాడు కొబ్బరి బూరా తెచ్చి చెవులో ఊదినా ఆ తాతగా రికి ఆనందంగానే ఉంది. బినా ఆయన్నని లాభం ఏముందిలే, అమ్మ పోయిన తర్వాత ఆయన తరహారే మారిపోయింది.

సుమిత్రకు అత్తగారు జ్ఞాపకానికి వచ్చింది. ఆమె కాపురానికి రాకముందే అత్తగారు చచ్చిపోయింది. అత్తగార్ని గురించి భాస్కరం చెప్పే మాటలు ఆమెకి పూజాత్తుగా జ్ఞాపకమొచ్చేయి.

"పదిమందిఉంటారని పూర్వకాలం కట్టు కున్న పెద్దిల్లు తప్ప ఇందులో మాత్రం ఎవరున్నారు సుమిత్రా! కాపరానికి వెళ్లే వరకూ మా సుందరమ్మక్క ఉండేది. నేను స్కూలు ఫైనలు ప్యాసయి కాలేజీలో చేరినా, తరవాత యంబీ చదువుతూ హాస్టె లులో ఉన్నా ఇంట్లో అమ్మా నాన్నా యిద్దరే ఉండేవారు. వాళ్ళ ప్రోగ్రాం ఏమిటో తెలుసా? పూర్వకాలపు వాళ్ళమా ఎనిమిదీ ఎనిమిదిన్నర కల్లా నిద్రపోయేవారు. ఎంత సేపని పడుకొంటారు? తెల్లారు ఝూమున ఏ మూడింటికో యిద్దరూ లేచి పోయే వారు. లేచి ఏం చెయ్యాలి గనక? అలా అమంచంమీద మాఅమ్మ, యీమంచం మీద మానాన్నా కబుర్లకి మొదలు పెట్టే వారు. మా అమ్మ ఏదంటే అది కాదనడం మానాన్నకి సరదా. ఆయనతో గిల్లికజ్జా పెట్టుకోడం మాఅమ్మకు హాబీ తెల్లారే సరికి యిద్దరూ పెద్ద దెబ్బలాటతో లేచేవారు. మువ్వ నమ్మవేమోగాని యించు మించు ప్రతి నిత్యం వాళ్ళ కార్యక్రమం అదే. ఓసారి పాకం ముదిరి దెబ్బలాట పెచ్చు పెరిగి మా అమ్మ మా నాన్నని ధడామడా తిట్టేసిందిట. దాంతో మా నాన్నకి కోపం వచ్చి అయిదు మైళ్ళ దూరంలో పల్లెటూళ్లో ఉన్న మా పింతండ్రి గారింటికి వెళ్ళి పోయాట్ట. ఎప్పుడూ రాలేదేమా మా నాన్నని మా బాబాయి వాళ్ళా నెత్తిమీద పెట్టుకునిచూశారుట. ఎంత యిదిగాచేసినా ఆయన ఏదోలోటు ఫీలయ్యేరుట. తరువాత యింటికొచ్చేక ఓసారి మాఅమ్మతో గట్టిగా దెబ్బలాడేశాక మనసు తేలిక పడిందట, బాగుందా?'

ఈ మాటలన్నీ సుమిత్రకి మళ్ళీ ఎవరో కావాలని చెబుతున్నట్టు అయింది.

"మాఅమ్మ పోయింతర్వాత మానాన్న తరహారే మారిపోయింది సుమిత్రా—కళ్లల్లో ఆ పెంకితనం ఆ నిండుతనం మళ్ళీ కనిపించ లేదు. మాఅమ్మ ఫోటోవైపు ఆయన చూసి నప్పుడల్లా "త్వరగా నా దగ్గరకి రండి. మీరు లేక పోతే సందడేముంది? నాకేం తోస్తుంది అని అవిడన్నట్టు ఉంటుందని మానాన్న నాతో చెప్పే వారు సుమిత్రా!"

భాస్కరం చెప్పిన ఈ మాటలు మళ్ళీ జ్ఞాపకానికి వచ్చి సుమిత్ర గొంతుతో కళ్లు తుడుచుకుంది. మనవణ్ణి మీదవేసుకుని గుఱ్ఱమెక్కి నవ్వుడూ, వకపక నవ్వినప్పుడు తన మావగారిలో పెంకితనం, నిండుతనం మళ్లీ కనపడలేదా?

సుందరమ్మ గొంగు పట్టుకుని పాపాయి లాగింది.

"అమ్మా మనం యివాళ సాయంత్రం బండిలో నాన్నగారి దగ్గిరకెళిపోతాం కదుటే?"

'అవును' అంది సుందరమ్మ.

"తాతి...తాతి...తా తా గాడ్ని మా మనతో తీసుకెళ్లద్దుటే!" అందిమురిపెంగా

'అవునే అమ్మా, బాబును మనతో తీసు కెళ్ళొద్దుటే!' అన్నాడు అనందు.

'మనతో వాడెందుకు వంపుతాడే వెర్రి తల్లీ!' అంది సుందరమ్మ.

దానికేముంది వదినా, తప్పకుండా తీసి కెళ్లు, వాడు రావాలేగాని — నా అను రోజులు అల్లరి తప్పినా తప్పినట్టే. వెధవ కాల్చుకు తినేస్తున్నాడు...ఎక్కడ ముఖ పడి పోతావో అని పెళ్ళయిన ఏడాదిలో పిలిచినట్టు వరుగెత్తుకొచ్చాడు!'

సుందరమ్మ నవ్వింది.

'ఏం చోద్యమమ్మా మరీని! ఈ వయసుకి ఆ కాలంలో నలుగురు పిల్లల్ని ఎత్తుకొనే వారట! ఒక్కగా నొక్క వెధవ వాడు నీకు బరువయ్యాడూ?'

సుమిత్ర మాటాడలేదు.

ఏం అత్తా, నిజంగా బాబుని తీసికెళ్ళ మన్నావా?' అని అడిగింది పాపాయి సుమి త్రని.

'చాల్లేఊరుకో, వర్రనాగమ్మ: మా తెల్ల వెధవ తల్లిని విడిచి ఎలా వస్తాడూ?' అని కోప్పడ్డాడు ముసిలాయన. నిజానికి సుంద రమ్మకి మేనల్లుణ్ణి ఓసారి సరదాగా తీసు కెళ్లాలని ఉంది. వాడి ఆకారమూ, వాడి కబుర్లూ అలాంటివి. వాడు ఓచోట ఉంటే వదినుంది వాడి చుట్టూ చేరతారు. ఈమధ్య తన దగ్గిరా చనువయింది.

'మధ్యన నీకెందుకు నాన్నా, వదినే ఏదో అడుగుతేనూ! అయినా వదినకూ పం పించాలనే ఉండాలిగాని వాడు తల్లిని విడిచి పెట్టి ఉండలేక పోడమేమిటి అర్థం లేని మాట? మొన్న పిల్లిద్దరూ కాకినాడ వడితే ఉండలేదూ నా దగ్గర?'

'నాకేం అభ్యంతరం లేదు వదినా! వి డుంటే ఒక్కపూటను వద్దుకోనియ్యడు. అక్కడ మళ్లీ ఏమల్లరి పెడతాడో ఏమో! అయినా నీ దగ్గిర చనువయింది కదూ! ఏం బాబూ, అత్తతో వెడతావా?'

బాబుగాడు మొంకాం పెకత్తాడు.

'ఏం అమ్మా, బాబూ! మాతో వస్తావు కదూ?' అంది పాపాయి.

'అవునా బాబూ! నువ్వెళ్లి పోతావా?' అని దీనంగా అడిగాడు ముసిలాయన. బాబుకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

'నీకు బిస్కట్లూ బిళ్ళలూ యిస్తాను, కథలు చెబుతాను. మనం రైలెక్కుదాం, ఎంచక్కా కారెక్కుదాం, వస్తావా?' అని అడిగేడు అనందు.

'అమ్మ నీతో రాదుట, అటువైన నీ యిష్టం' అన్నాడు తాత.

చిన్న బాబు మళ్లీ [illegible] వచ్చాడు.

# ★ సుమిత్ర ★

"పుత్రాణ్ణి విడదీయడం బాగానే ఉంది. ఒక్కమాట సరిగ్గా చెప్పు సుమిత్రా, వాడు నిన్నొదిలి ఉండగలడా?"

"వాడికి నా ధ్యాస ఎప్పుడూ లేదు. ఎక్కడబడితే అక్కడే ఉంటాడు." అంది సుమిత్ర మేనల్లుణ్ణి భర్తకి చూపిద్దామని సుందరమ్మకి ఎప్పట్నుంచో ఉంది.

"సరే తీసుకువెళతామమ్మా — ఎల్లుండి కదూ ప్రయాణం మీది? ఈ రెండ్రోజులూ ఉంచుకొని అక్కడికి దగ్గిరేకదూ అయన్నిచ్చి దిగబెట్టిస్తాను - సరేనా? వీడి బట్టలేవీ యస్తావా సర్దుతాను" అంది సంతోషంతో సుందరమ్మ.

సుమిత్ర రెండు జతలు శుభ్రమైనవి తెచ్చిచ్చింది. పక్కనే ఉన్న ముసలాయన మొహం చూసింది. ఆయన మొహం అంత నల్లగా మాడిపోయి ఉండడం ఆమె ఎప్పుడూ చూడలేదు సుందరమ్మ చేతిలో బట్టలు ఆయన చేత్తో కింద పారేశాడు.

"చిన్న పిల్ల ఆ అమ్మాయికి మతిలేకపోతే పెద్దదానివి నీ బుద్ధేమయింది? మీ ముచ్చట కోసం నోరెరగని ఆ గుంట వెధవని తల్లి నుంచి వేరుచేస్తారా? ఇదేమయినా బాగుందేమో వాణ్ణి రానీ అడుగుతాను" సరిగ్గా ఆ సమయానికే భాస్కరం యింటికి వచ్చాడు. ముసలాయన లోపలికి వెళ్లిపోయాడు. సుందరమ్మ అంతా చెప్పింది.

"దానికేముందే పెద్ద భాగ్యం? తప్పకుండా తీసుకెళ్ళు" అన్నాడు.

సాయంకాలమయింది. బండి వచ్చి వీధిలో నిలబడింది. సామాన్లు ఒకటీ ఒకటీ లోపల పెడుతున్నారు.

"బాబూ, అత్తని అల్లరిపెట్టకూ, పాపాయీ ఆనందూ చెప్పినట్లు వినూ."

అని కొడుక్కి చెబుతోంది సుమిత్ర. సుందరమ్మ లోపలికెళ్ళి తండ్రి కాళ్ళకి దండం పెట్టింది. 'వస్తాను నాన్నా' అంది. ముసలాయన అటు తిరిగి పడుకున్నాడు. ఆయన అలకకి కారణమేమిటో సుందరమ్మకి అర్థం కాలేదు.

"పాపాయీ, ఆనందూ, బండీ ఎక్కండే" అని ఆమె వదిన చేతిలో పిల్లాణ్ణి అందుకుంది. 'వస్తాను వదినా, తమ్ముడూ అక్కడికి వెళ్ళగానే రాయండేం' అంటూ బండి ఎక్కింది. బండి కదిలింది. భాస్కరం, సుమిత్ర బండి చివర తల్లికోసమయినా ఏడవకుండా నిశ్చింతగా కూర్చున్న బాబుగాణ్ణి చూస్తూ అయిదు నిముషాలు నిలబడ్డారు. గది తలుపు ధభ్భున తెరుచుకుంది. ముసలాయన ఒక్క పరుగున బండిదగ్గిరకు వెళ్ళి చివర్న కూర్చున్న బాబును గబుక్కున లాగి... 'వెధవా, ఎవరికీ లేకపోతేపోయింది నీకైనా ఉండొద్దూ బుద్ధి?' అని ఘొల్లుమని ఒక్కరెంటకాయించి ఏడుస్తున్న వాణ్ణి అలాగే ఎత్తుకొని గదిలోకి తీసుకెళ్ళి థళ్లని తలుపువేసేసి అల్లంతదూరాన బండిలో ఉన్న సుందరమ్మకు కూడా వినపడేంత గట్టిగా "ఈసారి తీసుకెళ్ళండి పిల్లాణ్ణి నాదగ్గర్నుంచి యెవరైనా, చెబ్తాను" అని అరిచాడు. భాస్కరం తండ్రిచేష్టలకు కొయ్యబారిపోయాడు. సుందరమ్మ మాత్రం "బాగుంది, ముసలాయనకి పిచ్చెక్కినట్టుంది. మా ఆయనకి వీణ్ణి చూపించి సంతోషపెట్టడం మాట దేముడెరుగు— యిప్పటికే ఆలస్యమయింది, యింకా ఉండిపోయామంటే ఆయనసలే ముక్కోపి— చెయ్యికూడా చేసుకుంటారేమో! కొంచెం త్వరగా తోలు బండబ్బీ" అంది. సుమిత్రమాత్రం మొదట ఆశ్చర్యపడినా ముసలాయన చేసిన ఈ విచిత్రచర్యలకు ముసిముసినవ్వులు నవ్వుకుంది. ఇన్నాళ్ళకు ఒక సమస్య దానంతటదే పరిష్కరింపబడినట్టు భావించి ఆమె మనస్సు అతి తేలిక అయింది. బాబుగాడిని తనతో వదిన తీసుకెడతానన్న దగ్గర్నుంచి ముసలాయన చూపిన ఆటంకాలు వంకలు తల్చుకొని ఆమె నవ్వుకుంది. ఈ రెండురోజులకే ఆయన మనవణ్ణి వదిలి ఉండలేరే, తాము వేరే కాపురం పెడితే?

"ఈసారి పిల్లాణ్ణి నాదగ్గిర్నుంచి ఎవరైనా తీసుకెళ్ళండి చెబుతాను" అన్నారు ఆయన! నిజానికి ఆయన దగ్గిర్నుంచి ఆ పిల్లాణ్ణి లాక్కునే హక్కు ఎవరికుంది?

వాళ్ళిద్దర్నీ విడదియ్యడానికి తనెవర్తె?

పిల్లాడికి గుచ్చుకుంటాయని మీసాలు తీయించేసిన తాతగారు, పిల్లాడు గంటల కొద్దీ గుఱ్ఱమని మీదెక్కి తొక్కినా జబ్బు పడడానికి సిద్ధపడిన తాతగారు, వాడు ఎక్కడికో వెడతాడని మాటమాత్రంవినగానే కుండిపడిపోయిన తాతగారు వీళ్ళిద్దరికీ కాకుండా చెయ్యడానికి తన కేమధికారం ఉంది?

చిగుళ్ళూ పండుటాకులూ ఒక కొమ్మ భాగాలే. ఎవరు విడదీయగలరు?

సుమిత్ర కిటికీలోంచి చూసింది.

మావగారు అటుతిరిగి పడుకునిఉన్నారు.

"తాతా, తాతా నాతో మాట్లాడవా?" అంటున్నాడు బాబు.

"ఎందుకు మాటాడుతాను? మరి నువ్వు మీ అత్తతో వెళిపోతానన్నావుగా!"

> మేష్టారు: "అమెరికానుండి ముఖ్యంగా ఎగుమతి అయ్యేదేమిటి?"
>
> విద్యార్థి: "డబ్బు."

"ఇంకెప్పుడూ అనను ఎల్లను. ఎల్లనంటే ఎల్లనుగా. మా అమ్మతోటీ ఎల్లను."

'ఎందుకు వెళ్లవు బాబూ? నా పిచ్చి కొద్దీ నిన్ను పరిగెత్తుకెళ్ళి తెచ్చుకున్నాను. రెండు మూడు రోజుల్లో నువ్వూ వెళ్లిపోతావు ఈ పిచ్చి తాత ఎవరిక్కావాలి? మీ నాయనమ్మకే అక్కర్లేక పోయింది!'

ముసలాయన పై కండువాతో కన్నీళ్లు తుడుచుకున్నాడు. సుమిత్ర యివతలనుంచి కష్టపడి కన్నీళ్లు ఆపుకుంది ఆమె విచారాలూ, విలాసాలూ, ఆశా సౌధాలూ ఏమయ్యాయో చెప్పలేము. ఆమెలో స్త్రీ సహజమైన కరుణ, మాతృవేదన, జాలి పొంగి పొర్లి పోయాయి.

ఇద్దరికీ బోక్కి పళ్లే. ఇద్దరివీ బోడిగుళ్లే. ఇద్దరివీ పిచ్చి కబుర్లే

'నాకు ఒకరు కాదు. యిద్దరు పిల్లలు!' అనుకుంది సుమిత్ర. ఆమెకు ఆనాటి మావగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి

'మనం దేవాలయానికి వెడుతూంటామా, దార్లో వందలకొద్దీ బీదవాళ్లు కనిపిస్తారు. కాని మనం వాళ్లని చూడకుండా తొందరగా దైవ దర్శనానికని తహతహ లాడుతాం. అందులో అసహజ మేముంది?'

'ఉంది. కావలసినంత అసహజముంది. మూర్ఖత్వమూ అవివేకమూ కూడా ఉంది. బీదవాళ్లనే ఆదరిస్తే దైవ దర్శనం దేనికి?'

— సుమిత్రకు యిన్నాళ్లకు సమాధానం దొరికింది.

'ఇక్కడేంచేస్తున్నావ్? పద మళ్లీ సామాన్లూ అవీ సర్దుకోవాలి'

'ఎందుకూ? నేను వాత్తేరు రాను. మీరిక్కడే ప్రాక్టీసు పెట్టండి'

భాస్కరం ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు ఆమె మొహంలో ఆ కొత్త వెలుగేమిటో అతనికి అర్థం కాలేదు.

* * *

వెన్నెల. వెన్నెల.

మంచి నవ్వులాంటి వెన్నెల. మల్లె పూవులాంటి వెన్నెల.

చందమామ ఉన్న చోట జగమంతా వెన్నెల.

మాతృమూర్తి ఉన్న చోట మనసంతా వెన్నెల. ★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.